## ఇది కదా అభివృద్ధి

# తీరనున్న కల

తాటిచెట్లపాలెం దరి వైఎస్సార్ నగర్‌లో సామాజిక భవనాన్ని గత పాలకులు నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో ఆపేయడంతో స్థానికులు తమ శుభ కార్యాల కోసం బయటెక్కడో ఇబ్బందులు పడేవారు. నాటి నాయకులు, అధికారులకు మొర పెట్టుకున్నా పని జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కార్పొరేటర్ కంపా హనోక్‌కు సమస్య గురించి విన్నవించుకున్నారు. వారు కె.కె. రాజుకు ఈ విషయం తెలపడంతో సామాజిక భవన నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరుకు ఆయన కృషి చేయడంతో భవన నిర్మాణ పనులు తిరిగి వేగం పుంజుకున్నాయి. త్వరలో పనులు పూర్తయి సామాజిక భవనం అందరికీ అందుబాటులోకి రానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలో తుది దశకు చేరుకున్న వైఎస్సార్ నగర్ సామాజిక భవనం

- త్వరలో అందుబాటులోకి వైఎస్సార్ నగర్ సామాజిక భవనం
- వైఎస్సార్‌సీపీ నాయకుల కృషితో విడుదలైన నిధులు

**పనులు.. నిధుల ఖర్చు ఇలా..**

భవనం కింది అంతస్తులోని బ్రిక్ వర్క్, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లాస్టరింగ్‌ల కోసం రూ. 19.50 లక్షల కేటాయింపు

రెండవ శ్లాబ్, బ్రిక్ వర్క్ కోసం రూ. 18.40 లక్షల కేటాయింపు

టాయ్‌లెట్స్, సీలింగ్, ఎలివేషన్ కోసం రూ. 19.20 లక్షల కేటాయింపు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్ల పాలెం దరి వైఎస్సార్ నగర్‌లో సామాజిక భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత వాసుల అవసరాలు తీర్చేందుకు ఈ సామాజిక భవన నిర్మాణానికి ఆనాటి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శంఖుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభించారు. కానీ పిల్లర్స్, మొదటి శ్లాబ్ వరకు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ మధ్యలో చేతులెత్తేసినట్లు తెలిసింది. చాలా కాలం అసంపూర్తిగా ఉన్న ఈ సామాజిక భవనం గురించి స్థానికులు వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కార్పొరేటర్ కంపా హనోక్‌కు తెలిపారు. దాంతో వారు ఈ సమస్యను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కె.కె. రాజు జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. సామాజిక భవన నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభింపజేశారు. ఈ భవనం కింది అంతస్తులో అసంపూర్తిగా ఉన్న బ్రిక్ వర్క్, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లాస్టరింగ్ వంటి వాటి కోసం 19.50 లక్షలు, రెండవ శ్లాబ్, బ్రిక్ వర్క్ కోసం 18.40 లక్షలు, టాయ్‌లెట్స్, సీలింగ్, ఎలివేషన్ వంటి పనుల కోసం 19.20 లక్షల జీవీఎంసీ నిధులతో పనులు పూర్తి చేయనున్నారు. గ్రానైట్ ఫ్లోరింగ్, ఆకట్టుకునే ఎలివేషన్ వంటి ఆధునిక వసతులతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. ఎంతో కాలంగా అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనం పూర్తి అవుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మొదటి అంతస్తులో జరుగుతున్న సీలింగ్, వైరింగ్ పనులు

**మా కల త్వరలో తీరనుంది..**



ఎంతో కాలంగా మా కల నీలో సామాజిక భవనం కోసం ఎదురు చూశాం. ఆ కల త్వరలో తీరనుంది. కె.కె.రాజు, కంపా హనోక్, పైడి రమణ వంటి నాయకుల నిరంతర కృషితో త్వరలోనే ఈ సామాజిక భవనం పూర్తి అయి మాకు అందుబాటులోకి రానుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో మొత్తం పనులు పూర్తి అయిపోయాయి. మొదటి అంతస్తులో పనులు కూడా తుది దశలో ఉన్నాయి. మాకు చాలా సంతోషంగా ఉంది.

– బాకి దుర్గా ఈశ్వరరావు, వైఎస్సార్ కాలనీ

**శుభకార్యాలకు అనువుగా ఉంటుంది..**



ఈ సామాజిక భవనానికి గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శంఖుస్థాపన చేశారు. కానీ మొదటి శ్లాబ్ వేసి పనులు ఆపేసారు. అప్పటి నుండి చాలా కాలం అసంపూర్తిగా ఉంది. ఈ మధ్యే పనుల కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు కృషి చేశారు. దీంతో ఈ పనులు తిరిగి ప్రారంభమై త్వరలోనే పూర్తి కానున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే మా కాలనీలో జరిగే శుభకార్యాలకు ఎంతో అనువుగా ఉంటుంది.

– వి. వరనరసింహనాయుడు, వైఎస్సార్ కాలనీ

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని తమిళ్ కలాయ్ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ జిల్లా కళింగ వైశ్య యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు తాలాసు సాయి మోహన్‌రావు, సెక్రటరీ భోగి ప్రవీణ కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు పాల్గొనగా, వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, వైశ్యరాజు జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు భద్రగిరిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరు రక్తదాతలు కావాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ పొట్నూరు గణేష్‌కుమార్, డైరెక్టర్లు సకలా బత్తుల ప్రసాదరావు, కంచరపాలెం సంఘం గౌరవ అధ్యక్షుడు పొట్నూరు మాధవి మధుసూదన్, సుందరరావు, జామి రామారావు, పి.వెంకట గోవింద్‌రాజు, ఎన్.సోమేశ్వరరావు, ఎం.సాయిరాజు, వి.వెంకట రమణ, బిల్డర్ భోగి గణేష్, కె.శంకరరావు, ఛత్రపతి శివాజీ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మెప్పించిన జపనీస్ స్టైల్ స్టోరీ టెల్లింగ్


జపనీస్ స్టైల్‌లో కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ వరలక్ష్మి

సీతంపేట : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో భారతీయ విద్యాభవన్ సహకారంతో ఆదివారం మియావాకీ స్టోరీ టైంలో కామిషిబాయి అని పిలువబడే సాంప్రదాయ జపనీస్ కథ చెప్పే పద్ధతిని విద్యార్థులకు పరిచయం చేశారు. కథాలయ ఫౌండేషన్‌కు చెందిన ప్రముఖ కథకురాలు వరలక్ష్మి జపనీస్ స్టైల్‌లో భారతీయ జానపద కథను వివరించారు. కథన శైలి, మాడ్యులేషన్ ఎలా ఉండాలో వివరించారు. వివిధ వాయిద్యాలతో సంగీతాన్ని జోడించడంతో సెషన్ మరింతగా మెప్పించింది. నగరంలో వివిధ పాఠశాలలకు చెందిన 65 మంది విద్యార్థులు ఈ సెషన్‌లో పాల్గొన్నారు. పిల్లలు జపనీస్ స్టైల్ కథలను ఆస్వాదించడమే కాకుండా, కామిషిబాయి బుట్టైని ఎలా ఉపయోగించాలి, అటువంటి ప్రత్యేకమైన కథ చెప్పే సాధనాన్ని ఉపయోగించి ఎలా కథలు చెప్పాలో నేర్చుకున్నారు.

### ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- అభ్యర్థులకు పోలీసుల సూచనలు


పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

మద్రిపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష 50, 51 వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఆదివారం నిర్వహించి న ఈ పరీక్ష 50వ వార్డు మాధవధార జీవీఎంసీ హైస్కూల్, అలాగే 51వ వార్డులోని శ్రీపాద డిగ్రీ కాలేజీ కేంద్రాలుగా నిర్వహించారు. మాధవధార హైస్కూల్ కేంద్రంలో మొత్తం 240 మంది అభ్యర్థులకు కేటాయించగా అందులో 213 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 27 మంది హాజరు కాలేదు. అలాగే శ్రీపాద డిగ్రీ కాలేజీ సెంటర్‌గా 288 మందికి కేటాయించగా 246 మంది అభ్యర్థులు హాజరు కాగా, 42 మంది గైర్హాజరయ్యారు.


అభ్యర్థులకు సూచలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార : గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రైల్వేస్టేషన్ ప్రధాన గేటు వద్ద పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. బస్సు రూట్‌తో పాటు పరీక్ష కేంద్రాలకు వెళ్లే మార్గాలను ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్ అభ్యర్థులకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు బస్సు రూట్‌తో పాటు కేంద్రాలకు వెళ్లే మార్గం గురించి వివరించినట్లు తెలిపారు.

### అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్

సీతమ్మధార : నగరంలో అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్ హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిరోజు రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో ఆ వివరాలు తెలపాలన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు

అల్లిపురం : వెంకటేశ్వర మెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో మాఘమాసం మూడవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు.



## ఎర్నిమాంబ వార్షిక జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఎర్నిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని, వారికి మౌలిక వసతులు, ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలి వార్షిక జాతర అతి వైభవంగా నిర్వహించేలా కరపత్రాలు, గోడపత్రికలతో ప్రచారం ప్రారంభించినట్లు ఆ తెలిపారు. ఈ ఏడాది వార్షిక జాతర అంగరంగ వైభవంగా చేయనున్నట్లు ఈవో సురేషబాబా తెలిపారు. దాతల సహాయంతో భక్తుల కోసం నిర్మిస్తున్న షెడ్లను ఎమ్మెల్యే వాసుపల్లి పరిశీలించారు. అనంతరం ఎర్నిమాంబ అమ్మవారి ముడుపు విశేషం, స్థల పురాణం, ముడుపు కట్టుకున్న భక్తులు పాటించాల్సిన నియమాలు, సేవల రుసుములు తదితర వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే వాసుపల్లి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, చుక్కా శ్యామ్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

సీతంపేట : జీవితం కోసమే చదువు అని కాకుండా, జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా మన పిల్లలను తయారు చేయాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో 'పిల్లల విద్యలో రావలసిన మార్పులు' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, నేటి చాట్ జీపీటీ యుగంలో ఒట్టి జ్ఞాపక శక్తి, బట్టీ చదువులకు చోటే లేదన్నారు. మార్కులు, ర్యాంకులపై వేలం వెర్రి తగ్గాలని సూచించారు. చిన్నతనం నుంచే ఇష్టమైన హాబీలు అలవర్చుకోకుంటే జీవితం యాంత్రికం అయిపోతుందన్నారు. పిల్లలు రోజూ ఆంగ్ల దినపత్రిక చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పిల్లల్లో అనేక రకాల మేధో కుశలతలు ఉంటాయని, ప్రతి విద్యార్థిని ఒక ప్రత్యేక వ్యక్తిగా చూడాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సదస్సులో చర్చించిన విషయాలు, విద్యా విధానంలో రావాల్సిన మార్పుల గురించి పాఠశాలలకు ఉపయోగపడేలా నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు పంపనున్నట్లు తెలిపారు.



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్

## జ్యోతినగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

కంచరపాలెం : నియోజకవర్గ పరిధిలో త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తామని నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు అన్నారు. జీవీఎంసీ 54వ వార్డులోని జ్యోతినగర్ జాతీయ రహదారిలో ఆదివారం వార్డు కార్పొరేటర్ చల్లా రజినితో కలిసి పర్యటించారు. అనంతరం జ్యోతినగర్ మహారాణివీధిలో సుమారు రూ 79.20 లక్షలు, రెడ్డికంచరపాలెం, కొత్తవాడవీధిలో సుమారు రూ.10 లక్షల సీసీ, బీటీ రోడ్డు పనులకు, గ్రీన్‌బెల్ట్ ఏరియాలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-5 ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, ఏఈ రత్నాకర్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరి, వార్డు అధ్యక్షుడు ఈశ్వరరావు, మండల కన్వీనర్ అధ్యక్షులు అమర్‌రెడ్డి, కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె. రాజు

## మార్చి 3,4 తేదీల్లో ఘంటసాల వర్ధంతి

సీతమ్మధార : అమర గాయకుడు, గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతి మార్చి 3,4 తేదీల్లో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడిల్ గంధర్వ ఏపీ -2024 పేరిట నిర్వహిస్తున్నట్లు ఘంటసాల స్మారక పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌కుమార్ తెలిపారు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాడుతా తియ్యగా మాదిరి ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు ద్వారా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీన ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్ట్ లోగో ఆవిష్కరణతో పాటు గాయకుడు దాము గేదెలకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా సినీ హీరో సుమన్, మిమిక్రీ ఆర్టిస్ట్, సినీ నటుడు శివారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని అన్నారు. దాము గేదెల మాట్లాడుతూ భవితరాలకు ఘంటసాల గాన మాధుర్యాన్ని అందించేందుకు ఐడిల్ గంధర్వ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ మాధవీకృష్ణ, శ్రీమాతా మ్యూజిక్ అధినేత పల్లి నాగభూషణ్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

## 'ఉత్తరం'లో అభివృద్ధి పరవళ్లు

మద్రిపాలెం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె. రాజు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 53వ వార్డులోని వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆదివారం సాయంత్రం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.50 లక్షల వ్యయంతో నరేంద్రనగర్‌లోని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రకేసరి నగర్‌లో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే శివనగర్, ఎఫ్‌సీ ఐనగర్‌కు సంబంధించి బీటీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రీన్ గార్డెన్స్‌లోని సీసీ రోడ్లు, బీటీరోడ్డుకు సంబంధించి రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చేసి చూపించారన్నారు. ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద మారియట్ హోటల్ నుంచి సీతమ్మధార వరకు మునుపెన్నడూ లేని విధంగా రూ.78 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేశామన్నారు. రోడ్డు వైడెనింగ్‌లో భాగంగా అక్కడున్న స్థానికులతో మాట్లాడి వారికి నష్టపరిహారం చెక్కులు కూడా అందజేశామన్నారు. అలాగే ఇనార్బిట్ మాల్ నిర్మాణం జరుగుతుందని, కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామని, అదే ప్రాంతంలో త్వరలోనే ఐటీ టవర్ కూడా రాబోతుందని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పోర్టు అధికారులతో చర్చలు జరిపామని, సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి వెసులుబాటు కల్పించమని అడిగామన్నారు. వెంటనే పోర్టు అధికారులు స్పందించారని, పోర్టు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.34 కోట్ల 76 లక్షలు అందజేయగా ఆ నిధులను నియోజకవర్గం అభివృద్ధికి వినియోగించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి పైడి కృష్ణారావు మాస్టర్, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 53వ వార్డు నాయకులు షేక్ బాబ్జీ, సదరం జ్ఞానేష్, హనుమంతు, రామారావు, నబీ, అన్సర్‌వలీ, గిరీష్, అలీ, రామశాస్త్రి, బాలాజీ, సుజాత, జయలక్ష్మి, జ్యోత్స్న, మంగ, చిన్నా, మరియమ్మ, సంపత్, సబానా, నరేంద్రనగర్, ఎఫ్‌సీఐ నగర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కె.కె. రాజు, బర్కత్ అలీ


నరేంద్రనగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కె.కె. రాజు, బర్కత్ అలీ

### 'సాత్విక మెలోడీస్' సాంస్కృతిక సంస్థకు శ్రీకారం


లక్ష్మీ సాత్వికను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట : గాయకులు వై. వరప్రసాద్, లక్ష్మీ సాత్వికల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సినీ సంగీత సాంస్కృతిక సంస్థ 'సాత్విక మెలోడీస్' స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సంస్థను గాయని లక్ష్మీ సాత్విక తల్లిదండ్రులు ఎస్.దేవుడు, కనకమహాలక్ష్మి దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ కళాకారులు, గాయనీ గాయకులను ప్రోత్సహించే విధంగా ఏర్పాటు చేసిన సాత్విక మెలోడీస్ సంస్థ అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు శైలజ, సుజాత, కవిత, మాధురి, స్వర్ణ, మెలోడీ సత్యనారాయణ, వి.ప్రభాకర్, ఎం.ఎస్. మాధవ్, లోకేష్, భయ్యా శ్రీనివాస్, లక్ష్మీ సాత్వికతో కలిసి పలు చిత్ర గీతాలు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు లక్ష్మీ సాత్వికను పలువురు సత్కరించి అభినందించారు. చెన్నా తిరుమలరావు, గంటి మురళి, ఎం.ఎస్.ఎల్.శైలజ, చీరాల ఉష పాల్గొన్నారు.

## ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బౌద్ధంతోనే అసమానతలు దూరం

సీతంపేట : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయవచ్చని పలువురు బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 11వ బౌద్ధ మహా సమ్మేళనం నిర్వహించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ ఆయాపాల మయతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకుడు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి.నటరాజ్ సౌఖ్య, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత సమాజంలోని అసమానతలను తొలగిహించాలంటే బౌద్ధం ఒక్కటే మార్గమన్నారు.

## 'బొమ్మా నీ పేరేమి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గునాల నిర్మల తదితరులు

సీతంపేట : గజల్ గాయని, రచయిత్రి జ్యోతిర్మయి మళ్ల రచించిన 'బొమ్మా బొమ్మా నీపేరేమి'పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ గునాల నిర్మల పుస్తకాన్ని ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకంలో తెలుగు వర్ణమాలలోని 54 అక్షరాలలో ప్రతి ఒక్క అక్షరాన్ని అందమైన వర్ణ చిత్రంగా ఆమె మలిచారన్నా రు. ఒక్కొక్క బొమ్మకి ఒక గేయం రాసి, అన్నింటినీ కలిపి అందమైన రంగుల పుస్తకంగా రూపొందించారని తెలిపారు. రచయిత్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ ఇందులో గేయాలన్నీ పిల్లలు అక్షరాలు నేర్చుకునేందుకు ఉపయోగపడే అందమైన ప్రక్రియ అన్నారు. ఈ పుస్తకానికి ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు బయదేవ్ బాబు అందమైన ముఖ చిత్రం చిత్రించారన్నారు. ఉపాధ్యాయిని విజయభాను కోటే పుస్తక సమీక్ష చేశారు. అక్షరంపై పిల్లలకు ఆసక్తి కలిగించాలనే బలమైన ఉద్దేశం ఈ ప్రయత్నంలో ఉందని తెలిపారు. గునాల నిర్మల, రచయిత డి.వి.సూర్యారావు, తెలుగు దండు పరవస్తు సూరి, పుక్కళ్ల రామకృష్ణ, శేఖరమంత్రి ప్రభాకర్ పాల్గొన్నారు.